# పారదర్శకంగా.. పథకాల అమలు

**ప్రతి పేద కుటుంబానికీ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం**

- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌రాబు
- రంగారెడ్డిజిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డిజిల్లా ప్రజాప్రతినిధుల సమావేశం


మంత్రి శ్రీధర్‌బాబుకు బొకే అందజేస్తున్న వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, చిత్రంలో రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్, రంగారెడ్డి, వికారాబాద్ కలెక్టర్లు

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 30 : ప్రతి నిరుపేద కుటుంబానికీ ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డిజిల్లా ప్రజాపాలన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని తీసుకువచ్చిందన్నారు. ప్రజాపాలన ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్నదన్నారు. తమ ప్రభుత్వం దళారీల ప్రమేయం లేకుండా పారదర్శకంగా పాలిస్తున్నదన్నారు. అభయహస్తం పథకం దరఖాస్తులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోవడానికి వచ్చే వారికి ఉచితంగా దరఖాస్తు ఫారాలు అందజేస్తున్నామన్నారు. కొంతమంది దరఖాస్తులను జిరాక్స్‌లు చేసి అమ్ముకోకుండా జిరాక్స్ కేంద్రాల వారికి అవగాహన కల్పించాలని, అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు ప్రత్యేక కౌంటర్ల ద్వారా దరఖాస్తులను స్వీకరించాలన్నారు. పేదలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీల పథకాలను అందించేందుకు అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే రెండు గ్యారెంటీలు అమలు చేశామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్యసేవల పరిమితిని ఐదు నుంచి పది లక్షలకు పెంచామన్నారు. మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, గృహజ్యోతి పథకాలకు ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. రేషన్ కార్డుల కోసం వచ్చే వారి కోసం తెల్ల కాగితంపై దరఖాస్తులు రాయించుకుని వారికి రసీదులు అందించాలని రెవెన్యూ, ఇతర అధికారులకు మంత్రి సూచించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని శాసనసభ్యులు, స్పెషల్ అధికారులను ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించే సమయంలో ఎదుర్కొనే సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

అంతకుముందు జిల్లా కలెక్టర్లు జిల్లాలోని ప్రజాపాలన వివరాలను మంత్రికి తెలియజేశారు. ఎక్కడా దరఖాస్తులందలేదు అనే సమస్య రాకుండా చూసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజాపాలనలో ప్రభుత్వ అధికారుల కృషిని మంత్రి అభినందించారు. సమావేశంలో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల చైర్‌పర్సన్లు అనితారెడ్డి, సునీతారెడ్డి, మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, అరికెపూడి గాంధీ, కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, సుధీర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, ఈర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు గౌతమ్, నారాయణరెడ్డి, లోకల్ బాడీల అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, అభిషేక్, సైబారాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, ఆర్డీవోలు, స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు

# రోజువారీ లక్ష్యాలను పూర్తి చేయాలి

**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌లను ఆదేశించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

వికారాబాద్, డిసెంబర్ 30 : వానకాలం యాసంగి 2022-23 ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ డాక్టర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వానకాలం, యాసంగిపై రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వానకాలం, యాసంగి 2022-23కు సంబంధించి మిల్లర్లకు కేటాయించిన రోజువారీ లక్ష్యాలను పూర్తి చేయుటకు జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులతో సమీక్షిస్తూ, మంత్రి సూచనల మేరకు జిల్లాలో ఎలాంటి జాప్యం లేకుండా సీఎంఆర్ డెలివరీ టార్గెట్ పూర్తి చేయుటకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్యాలు పూర్తయ్యేంత వరకు సంబంధిత మిల్లుల్లో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తదితరులు


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

## చర్యలు తీసుకోవాలి

ఇబ్రహీంపట్నం : వానకాలం, యాసంగిలో మిల్లర్లకు కేటాయించిన రోజువారీ లక్ష్యాలను పూర్తిచేసేలా చూడాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌డ్డి ఆ శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వానకాలం యాసంగి 2022-23 మిల్లర్లకు కేటాయించిన రోజువారీ లక్ష్యాలను మిల్లింగ్ కెపాసిటీ ప్రకారం పూర్తి చేయుటకు జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి జిల్లా సివిల్ సప్లయ్ అధికారి మనోహర్ రాథోడ్, డీఎం సివిల్ సప్లై విజయలక్ష్మి, అధికారులున్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు


ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ క్వార్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

## ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ క్వార్టర్ పరిశీలన

వికారాబాద్, డిసెంబర్ 30 : వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ క్వార్టర్‌ను శనివారం ఎస్పీ కోటిరెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. పోలీసు సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన సబ్సిడీ పోలీస్ క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. క్యాంటీన్‌లో పోలీస్ సిబ్బందికి అవసరమున్న, కావాల్సిన సరుకులకు సంబంధించిన విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఆర్ఐలు అజ్మత్ పాషా, నాయుడు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, ఆర్ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

**వేడుకలు నిర్వహించేవారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలి**

2024 నూతన సంవత్సరం సందర్భంగా వేడుకలు నిర్వహించుకునేవారు తప్పనిసరిగా పోలీస్ అధికారుల నియమాలు పాటించాలని ఎస్పీ కోటిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 19 స్పెషల్ టీంలు, 20 డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేడుకల్లో గంజాయి ఇతర మాదక ద్రవ్యాలు వాడటం నిషేధమని, ఎక్కడైనా వినియోగిస్తే పోలీస్ అధికారులకు తెలియజేయాలని సూచించారు.


# కొత్త సంవత్సరంలో సీఎం కానుక

**కొడంగల్ అభివృద్ధికి 'కాడా' జీవో విడుదలపై హర్షం**


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి

కొడంగల్, డిసెంబర్ 30 : కొత్త సంవత్సరంలో కొడంగల్ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి 'కాడా' జీవోను విడుదల చేయడంపై మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం మాజీ ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ.. కొడంగల్‌లో పెద్దఎత్తున అభివృద్ధి చేపట్టే దిశగా సీఎం శ్రీకారం చుట్టారని, కొడంగల్ నియోజకవర్గ ప్రజలకు కొత్త సంవత్సరం కానుగా కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా) జీవోను అందించినట్లు తెలిపారు. కాడా జీవో విడుదలతో కొడంగల్ త్వరితగతిన అభివృద్ధి చెందే ఆస్కారం ఉందని, పెద్దఎత్తున నిధులు కూడా మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. కొడంగల్ నియోజకవర్గ ప్రాంతం ఇదివరకు చాలా వెనుకబడిన ప్రాంతంగా ఉందని, కాడా జీవోతో రానున్న రోజుల్లో కొడంగల్ నియోకవర్గం ఓ సిరిసిల్ల, గజ్వేల్ కంటే మరింతగా అభివృద్ధి చెందుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో ఉపాధి అవకాశాలు తక్కువగా ఉండటం, వ్యవసాయం వర్షాలపైనే ఆధారపడిన ప్రాంతంగా ఉందన్నారు. కాడాతో కొడంగల్ ప్రాంతానికి కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం పూర్తయ్యే అవకాశం ఉందని, దాంతో వ్యవసాయంలో నూతన శకం ప్రారంభం అవుతుందన్నారు. ఈ ప్రాంతంలో సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు రైల్వే లైన్ వంటి ఎన్నో అభివృద్ధి పనులు జనేగనున్నట్లు పేర్కొన్నారు. కొడంగల్, కోస్గి మున్సిపాలిటీలో మాస్టర్ ప్లాన్ ప్రకారం పనుల ప్రక్రియ కూడా కొనసాగుతుందన్నారు. ఎంపీపీ ముద్దప్ప మాట్లాడుతూ.. కొడంగల్ ప్రాంతం ప్రస్తుతం ఎంత వెనుబడి ఉందో.. రానున్న రోజుల్లో అభివృద్ధి శకంలో ఓ నూతన ఒరవడి సంతరించుకోనున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలతో పాటు, విద్య, వైద్యం తదితర అంశాల్లో పూర్తి స్థాయి అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం కొనసాగిస్తున్న ప్రజాపాలన కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, కోఆప్షన్ సభ్యుడు మునీర్ పాల్గొన్నారు.

## 'కాడా' ప్రత్యేక అధికారిగా వెంకట్‌రెడ్డి



కొడంగల్, డిసెంబర్ 30 : కొడంగల్ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కాడా) జీవోను జారీ చేయడంతో పాటు ప్రత్యేకాధికారి నియామకం చేపట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తున్న వెంకట్‌రెడ్డికి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించి కాడా ప్రత్యేకాధికారిగా నియమిస్తూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో 'కాడా' కొనసాగనున్నది. కొడంగల్ నియోజకవర్గంలోని 8 మండలాల పరిధిలో అధికారులు నియమించబడటంతో పాటు త్వరలో కమిటీ ఏర్పాటు కానున్నట్లు సమాచారం.

## ఘనంగా కృష్ణస్వామి జాతర ప్రారంభం

**గ్రామ వీధుల్లో పల్లకి సేవ, కలశాలతో ఊరేగింపు**

బొంరాస్‌పేట, డిసెంబర్ 30 : దుద్యాల మండల కేంద్రానికి సమీపంలో కృష్ణగిరిపై స్వయంభువుగా వెలసిన కృష్ణస్వామి ఆలయ 22వ వార్షిక జాతర బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు గ్రామంలోని ఆలయంలో వీరాంజనేయస్వామికి సింధూరాభిషేకం చేశారు. అనంతరం స్వామివారి మందిరం నుంచి పల్లకిసేవ, మహిళలు కలశాలతో జల కుంభ ఊరేగింపును గ్రామ వీధుల గుండా కృష్ణగిరి వరకు నిర్వహించారు. అనంతరం కృష్ణస్వామికి జల కుంభాభిషేకం చేసి పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పూజారి విశ్వనాథం, గ్రామస్తులు పాల్గొన్నారు.